




# మనం

## నల్లగొండ

సూర్యాపేట, యాదాద్రి భువనగిరి

మంగళవారం | 13 | అక్టోబర్ | 2026 | పేజీలు 8 | www.manamepaper.com


## ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం

# పోరాటం

### మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

**ప్రజాస్వామ్యానికి ప్రాణం ఓటు అని, ఆ ఓటు హక్కునే బలహీనపరిచే ప్రయత్నాలు జరిగితే దేశ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం ఢిల్లీలో రాహుల్ గాంధీ నాయకత్వంలో ఇండియా కూటమి పార్టీలు చేపట్టిన సుప్రీంకోర్టు మార్చ్ లో మంత్రి కోమటిరెడ్డి.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ తదితరులతో కలిసి పాల్గొన్నారు.**

నల్లగొండ–అక్టోబర్ 12( మనం ప్రతినిధి) : ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కును హరించే కుట్రలను సహించేది లేదు, ఓటు చోరీపై దేశవ్యాప్త పోరాటం కొనసాగిస్తాం అన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కు మార్ బీజేపీ కార్యకర్తలా వ్యవహరిస్తున్నారు. ఆయన రాజీనామా

- మిగతా 2లో..

## శిఖం భూమిలో

# అక్రమ నిర్మాణాలకు బ్రేక్

### అక్రమార్కులకు నోటీసులు జారీ.. మనం పత్రిక కథనానికి స్పందన






కోదాడ పెద్ద చెరువు భూమిలో అక్రమ నిర్మాణాలు?

మనం

మనం జిల్లా టాబ్లాయిడ్‌లో ప్రచురితమైన కథనం

**అనంతగిరి మండల పరిధిలోని ఖానాపురం రెవెన్యూ పరిధిలో కోదాడ పెద్ద చెరువు శిఖం భూమిలో సుమారు ఎకరం విస్తీర్ణాన్ని ఆక్రమించి కొందరు వ్యక్తులు అక్రమంగా భవన నిర్మాణాలు చేపడుతున్నారని మత్స్యశాఖ సంఘ చైర్మన్ నాగేంద్రబాబు విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ అక్రమాలపై 'మనం' పత్రిక ఆదివారం ప్రముఖంగా కథనాన్ని ప్రచురించింది.**

అనంతగిరి, మనం న్యూస్, అక్టోబర్ 12 : కథనానికి అధికార యంత్రాంగం వెంటనే స్పందించింది. మనం పత్రికలో వార్త రావడంతో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు హుటాహుటిన సంఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ

- మిగతా 2లో..

## చిట్యాల పోలీస్ స్టేషన్‌ను

# ఐజీ షాహనవాజ్ ఖాసిం సందర్శన



నల్గొండ –అక్టోబర్ 12 ( మనం ప్రతినిధి) : చిట్యాల పోలీస్ స్టేషన్‌ను యాదాద్రి జోన్ ఐజీ షాహనవాజ్ ఖాసిం సందర్శించి, పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న విధులు, కేసుల దర్యాప్తు పురోగతి, స్టేషన్ రికార్డులు, శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ ఐజీ వెంట ఉన్నారు. పోలీస్

- మిగతా 2లో..

## ఎల్‌నినో ప్రభావాన్ని

# సమష్టిగా ఎదుర్కోవాలి

- తాగునీటికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి : భట్టి
- నీటి లభ్యతను బట్టి యాసంగి పంటల సాగుపై రైతులు నిర్ణయం తీసుకోవాలి
- నీరు అందుబాటులో లేకుంటే సాగుకు దూరంగా ఉండాలి.. ప్రత్యామ్నాయ పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలి
- మనుషులతో పాటు పశుసంపదను కాపాడుకోవాలి మేత తాగునీటి ఏర్పాట్లు చేయాలి
- కష్టకాలంలో అధికారులకు సహకరించాలి
- ప్రపంచ వ్యాప్తంగా తాగు, సాగునీరు, విద్యుత్ సమస్యలు తలెత్తే అవకాశం
- కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి
- గ్రామాల్లో ఉపాధి హామీ పనులను విస్తృతం చేయాలి
- మంత్రులు భట్టి విక్రమార్క, తుమ్మల, పొన్నం



సూర్యాపేట అక్టోబర్ 12 (మనం ప్రతినిధి) : సూపర్ ఎల్‌నినో ప్రభావం ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తోందని, అనేక ప్రాంతాల్లో తాగునీరు, సాగునీరు, విద్యుత్ సమస్యలు తలెత్తే పరిస్థితులు ఉన్నాయని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. సోమవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర

- మిగతా 9లో..

# చిట్యాల పోలీస్ స్టేషన్‌ను ఐజీ షాహనవాజ్ ఖాసిం సందర్శన




మొదటి పేజీ తరువాయి

స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణ, పెండింగ్ కేసుల పరిష్కారం, రోడ్డు ప్రమాదాల నివారణ, మహిళలు, బాలల భద్రతకు తీసుకుంటున్న చర్యలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఐజీ షాహనవాజ్ ఖాసిం గారు మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను సావధానంగా విని చట్టప్రకారం సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యతతో పరిశీలించి, బాధితులకు పోలీస్ శాఖపై నమ్మకం కలిగించేలా విధులు నిర్వహించాలని ఆదేశించారు. చిట్యాల పోలీస్ స్టేషన్ పరిధిలో జాతీయ రహదారితో పాటు ఇతర రహదారులపై రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఐజీ గారు సూచించారు. తరచుగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి, ప్రమాదాలకు గల కారణాలను విశ్లేషించి, సంబంధిత శాఖల సమన్వయంతో నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వాహనదారులకు హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం, వేగ నియంత్రణ, రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తూ ప్రమాదాల నివారణకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించి క్షతగాత్రులకు సకాలంలో వైద్య సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

మహిళలు, బాలికలు, చిన్నారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, పోక్సో చట్టం కింద నమోదయ్యే కేసుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐజీ తెలిపారు. బాలలపై లైంగిక నేరాలకు సంబంధించిన ఫిర్యాదులు అందిన వెంటనే చట్టప్రకారం స్పందించి, బాధిత బాలబాలికలకు అవసరమైన రక్షణ, భరోసా కల్పించాలని సూచించారు. బాధితుల గోప్యతను కాపాడుతూ, నిబంధనల ప్రకారం సున్నితంగా విచారణ చేపట్టాలని, సంబంధిత కేసుల్లో శాస్త్రీయ ఆధారాలు సేకరించి నాణ్యమైన దర్యాప్తు నిర్వహించాలని ఆదేశించారు. బాలలపై నేరాలు జరగకుండా పాఠశాలలు, కళాశాలలు, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, అనుమానాస్పద వ్యక్తులు లేదా ఘటనలపై ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించేలా చైతన్యం కల్పించాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనాలు, ఇళ్ల దొంగతనాలు, వాహనాల చోరీలు, ఇతర ఆస్తి సంబంధిత నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఐజీ సూచించారు. గతంలో దొంగతనాలు జరిగిన ప్రాంతాలు, నేరాలు ఎక్కువగా నమోదయ్యే ప్రాంతాలను గుర్తించి నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని, రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచడంతో పాటు సీసీ కెమెరాల వినియోగాన్ని ప్రోత్సహించాలని, నేరస్తుల కదలికలను గుర్తించేందుకు అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని ఆదేశించారు. దొంగతనాల కేసుల్లో నిందితులను గుర్తించేందుకు పక్కా ఆధారాలు సేకరించి, చోరీకి గురైన ఆస్తిని రికవరీ చేసేందుకు సమన్వయంతో దర్యాప్తు చేపట్టాలని సూచించారు.రౌడీషీటర్లు, గతంలో నేరాలకు పాల్పడిన వ్యక్తులు, పునరావృత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామాలు, పట్టణాల్లో ప్రజలతో సమన్వయం పెంచుకుంటూ, అనుమానాస్పద కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం అందించేలా ప్రజలను ప్రోత్సహించాలని సూచించారు. సైబర్ నేరాలపై కూడా ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ఆన్‌లైన్ మోసాలకు గురైన బాధితులు వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేసేలా ప్రచారం నిర్వహించాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక సమీక్ష నిర్వహిస్తూ, దర్యాప్తులను వేగవంతం చేయాలని, నేరాలకు సంబంధించిన సాక్ష్యాధారాలను పకడ్బందీగా సేకరించాలని ఐజీ ఆదేశించారు. కోర్టు కేసుల్లో సాక్షుల హాజరు, సమన్ల అమలు, చార్జిషీట్ల దాఖలు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి, నేరస్తులకు శిక్షలు పడేలా నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని సూచించారు. పోలీస్ స్టేషన్ రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహిస్తూ, విధుల్లో పారదర్శకత, క్రమశిక్షణ పాటించాలని తెలిపారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ మాట్లాడుతూ, జిల్లా పోలీస్ శాఖ తరపున రోడ్డు ప్రమాదాల నివారణ, నేరాల నియంత్రణ, మహిళలు, బాలల భద్రత, దొంగతనాల అరికట్టడం, ప్రజలకు మె-రుగైన పోలీస్ సేవలు అందించేందుకు సమగ్ర చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఐజీ సూచనల మేరకు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణను మరింత పెంచి, పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణే లక్ష్యంగా ప్రతి పోలీస్ అధికారి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఐజీ షాహనవాజ్ ఖాసిం. సూచించారు.

ఈ తనిఖీలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్‌తో పాటు నల్లగొండ డిఎస్పీ శివరాం రెడ్డి చిట్యాల సిఐ సురేష్, ఎస్.ఐ వెంకట్ రెడ్డి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## బాల త్రిపుర సుందరి దేవిగా కనకదుర్గ



పెన్ పహాడ్ అక్టోబర్ 12 (మనం న్యూస్): దేవి శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా సోమవారం కనకదుర్గాదేవి బాల త్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చింది ఈ సందర్భంగా రెండో రోజు కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు మండలంలోని లింగాల గ్రామంలో కనకదుర్గమ్మ దేవాలయంలో స్థానిక పురోహితులు ఇరువంటి సత్యనారాయణ శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు మాల ధారణ చేసిన స్వాములు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించుకున్నారు భక్తులతో ఆలయ ప్రాంగణం పోటెత్తింది ఈ సందర్భంగా ఉదయం సాయంకాల సమయంలో కనకదుర్గ దేవికి వైభవంగా పూజ నిర్వహించారు గ్రామంతోపాటు వివిధ గ్రామాల నుండి భక్తులు విచ్చేశారు ఆలయంలో మహిళలు భక్తి భావంతో అమ్మ వారి కీర్తనలు పాడారు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు...

## శిఖం భూమిలో అక్రమ నిర్మాణాలకు బ్రేక్

మొదటి పేజీ తరువాయి



చేపట్టారు. శిఖం భూమిని ఆక్రమించి చేపడుతున్న అక్రమ భవన నిర్మాణ పనులను తక్షణమే నిలిపివేయాలని ఆదేశిస్తూ, ఆక్రమణకు పాల్పడిన వ్యక్తులకు నోటీసులు జారీ చేశారు. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిని గుర్తించి సర్వే చేయనున్నట్లు అధికారులు తెలిపారు. వందలాది మంది మత్స్యకారులకు జీవనాధారంగా ఉన్న చెరువును కాపాడేందుకు కథనాన్ని ప్రచురించి, నిద్రపోతున్న అధికార యంత్రాంగాన్ని కదిలించిన 'మనం' పత్రికపై మత్స్య సంఘ సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. అధికారులను సైతం పరుగులు పెట్టించి అక్రమాలకు పాల్పడిన వారికి చెంపపెట్టుగా మనం పత్రిక నిలవడం మండల వ్యాప్తంగా చర్చనీయాంశంగా, అభినందనలకు మూలంగా మారింది.

## ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ నాయకత్వంలో పోరాటం

మొదటి పేజీ తరువాయి

చేయాలి. ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు సీబీఐ, ఈడీ తర్వాత ఇప్పుడు ఎన్నికల కమిషన్ ను అడ్డం పెట్టుకుంటున్నారు. సర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలి. దేశంలో 13 కోట్ల ఓట్లు తొలగించారన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరగాలి. "ఇది కాంగ్రెస్ పార్టీ కోసం చేస్తున్న పోరాటం కాదు.. రేపటి తరాల భవిష్యత్తు కోసం, ప్రతి పౌరుడి ఓటు హక్కు కోసం, దేశ ప్రజాస్వామ్యాన్ని కాపాడటం కోసం చేస్తున్న పోరాటం" అని మంత్రి స్పష్టం చేశారు.

## రైతులను గాలికి వదిలేసి ఢిల్లీ యాత్రలా?

### మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

వనపర్తి అక్టోబర్ 13 (మనం ప్రతినిధి) : ఎల్ నినో ప్రభావంపై కీలక క్యాబినెట్ సమావేశం, రైతు వేదికల్లో రైతులతో వీడియో కాన్ఫరెన్స్ అని ప్రకటించి దానిని వాయిదా వేసి సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు అంతా ఢిల్లీకి వెళ్లడం వారి బాధ్యతా రాహిత్యానికి నిదర్శనమని మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. అబద్ధాలతో అధికారంలోకి వచ్చి అబద్ధాలతోనే పాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు. మొన్నటిదాకా ఆరుతడి పంటలు వేసుకోమని ప్రచారం చేసి ఇప్పుడు రెండో పంట వద్దంటూ రైతులను హెచ్చరించడం దుర్మార్గమన్నారు. సాగునీళ్లు మాత్రమే కాదు తాగునీళ్లు, కరెంటు కూడా ఇవ్వలేమని ప్రకటించడం ప్రభుత్వం చేతులెత్తేసిందనడానికి నిదర్శనమని, నీళ్లు ఎత్తిపోసుకునే అవకాశం ఉన్నా మోటార్లు బంద్ పెట్టి రైతాంగం నడ్డి విరిచారని ఆరోపించారు.

# ఎన్నికల కమిషనర్ రాజీనామా కోరడం అర్థరహితం

## బిజెపి కార్మిక సెల్ రాష్ట్ర కన్వీనర్ అందె శ్రీనివాస్



తిరుమలగిరి అక్టోబర్ 12 (మనం న్యూస్) : కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీతో పాటు ఇతర ప్రతిపక్ష నాయకులు డిమాండ్ చేయడం అర్థరహితమని భారతీయ జనతా పార్టీ కార్మిక సెల్ రాష్ట్ర కన్వీనర్ అందె శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం చేపట్టిన సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తోందని పేర్కొన్నారు. అయితే, ఈ కార్యక్రమానికి ఉద్దేశపూర్వకంగా విఘాతం కలిగించేలా ప్రతిపక్ష పార్టీలు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ప్రతిపక్షాల వైఖరిని ప్రజలు గమనిస్తున్నారని ఆయన అన్నారు. అదేవిధంగా, తెలంగాణలో డ్రగ్స్ సమస్యను నిర్మూలించడంలో విఫలమవుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గోవా రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేయడం అర్థరహితమని అందె వ్యాఖ్యానించారు. ముందుగా రాష్ట్రంలో డ్రగ్స్ సమస్యను నియంత్రించేందుకు ప్రభుత్వం సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర లేబర్ సెల్ కో-కన్వీనర్ మన్వీర్ సింగ్, సూర్యాపేట జిల్లా కార్మిక విభాగం ఇన్‌చార్జి శేషగిరిరావు, నల్గొండ జిల్లా కన్వీనర్ రైతం రాజు సిద్ధు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు మేడబోయిన యాదగిరి, దీన్ దయాల్, మూల వెంకన్న, వెల్పుల రమేష్, అంబటి మహేష్ గౌడ్, వాటం బాలరాజు, లకావత్ కృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# సాయికుమార్‌కు అండగా నల్లమోతు సిద్ధార్థ

## గాయపడిన సాయికుమార్‌కు పరామర్శ: కుటుంబ సభ్యులకు ధైర్యం



మాడుగులపల్లి, అక్టోబర్ 12 (మనం న్యూస్) : నల్లగొండ జిల్లా మాడుగులపల్లి మండలం కుక్కడం గ్రామంలో ఇటీవల వినాయక చవితి నిమజ్జనం సందర్భంగా జరిగిన ఘర్షణలో గాయపడిన పోతేపాక సాయికుమార్‌ను బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నల్లమోతు సిద్ధార్థ సోమవారం ఆయన నివాసంలో పరామర్శించారు. చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న సాయికుమార్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ మున్సిపాలిటీ 19వ వార్డు కౌన్సిలర్ యర్రమళ్ళ దినేష్, మాడుగులపల్లి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాలుట్ల బాబయ్య, స్థానిక సర్పంచ్ ఊర ప్రసన్న, ఉపసర్పంచ్ మస్తాన్ అలీ, మాజీ సర్పంచ్ అలుగుబిల్లి గోవిందరెడ్డి, మాజీ ఎంపీటీసీ పుట్ట పద్మ, సీనియర్ నాయకులు నకరేకంటి శ్రీను, వంటేపాక లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రతికూల పరిస్థితుల్లో కాపాడుకోవడానికి కరాటే దోహదం

కోదాడ, అక్టోబర్ 12(మనం న్యూస్): జేకేవిడబ్ల్యుఎఫ్ చోట ఖాన్ కరాటే గత నెలలో జరిగినటువంటి బెల్ట్ ఎగ్జామ్ లో ఉత్తీర్ణతటువంటి విద్యార్థిని విద్యార్థులకు సోమవారం బెల్టులు, సర్టిఫికెట్లు భారత్ పబ్లిక్ స్కూల్ విద్యాసంస్థల కరస్పాండెంట్ శమంత్రి ప్రగడ శ్రీధర్ రావు వారిచే ఇవ్వడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ కరాటే కేవలం యుద్ధ విద్య మాత్రమే కాదని ప్రతికూల పరిస్థితుల్లో తమను తాము కాపాడుకోవడానికి , ఆత్మవిశ్వాసం పెంచుకోవడానికి మరియు ఏకాగ్రతకు తోడ్పడుతుందని వారన్నారు. మాస్టర్ సూర్య మాట్లాడుతూ కరాటే ప్రతి కదలికకు క్రమశిక్షణ ఎంతో ముఖ్యం దీన్ని అలవాటుగా చేస్తుందని, శరీర దృఢత్వాన్ని పెంపొందిస్తూ పెద్దవారితో మర్యాదగా నడుచుకునే గుణం నేర్పుతుంది అని అన్నారు.



# లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలు మరువలేనివి

## వెంపటి సర్పంచ్ తప్పట్ల ఎల్లయ్య

తుంగతుర్తి :అక్టోబర్12,(మనం న్యూస్) : సమాజంలో పేద ప్రజలకు లైన్స్ క్లబ్ చేస్తున్న సేవలు మరువలేనని వెంబడి సర్పంచ్ తప్పట్ల. ఎల్లయ్య అన్నారు. సోమవారం మండల పరిధిలోని వెంబడి గ్రామపంచాయతీ ఆవరణలో సూర్యాపేట లైన్స్ క్లబ్ కంటి వైద్య శిబిరం ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ సమాజంలో లైన్స్ క్లబ్ సభ్యులు ప్రజల నుండి ఏమీ ఆశించకుండా ప్రజలకే వైద్య శిబిరాలు. అల్పాహార కార్యక్రమాలు పేద ప్రజలకు చేపట్టడం అభినందనీయమని అన్నారు. ప్రతి ఒక్కరు సమాజంలో ఇతరులకు తమకు తోచిన విధంగా సేవ చేసే గుణాన్ని అలవర్చుకోవాలని కోరారు. అనంతరం సర్పంచ్ ఉపసర్పంచ్ ,శాలువాతో ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో తుంగతుర్తి లైన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ పోలవరపు సంతోష్ మండల అధ్యక్షుడు తల్లాడ కేదారి, కోశాధికారి ఓరుగంటి శ్రీనివాస్, ఉప సర్పంచ్ దాసరి మంజుల రామచంద్రు, దాయం ఝాన్సీ రెడ్డి, కొండగడుపు ఎల్లయ్య, బండారు శేషు, ప్రధాన కార్యదర్శి శ్రీను, లైన్స్ క్లబ్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.






# గాయత్రీ దేవి అలంకరణలో దుర్గమ్మ తల్లి

నేరేడుచర్ల అక్టోబర్ 12 మనం న్యూస్ : శ్రీదేవి నవరాత్రి దసరా వేడుకలలో భాగంగా రెండవ రోజు దుర్గమ్మ తల్లి శ్రీ గాయత్రీ దేవి అలంకరణలో సోమవారం దర్శనమిచ్చారు. నేరేడుచర్ల పట్టణంలోగల శ్రీ విజయదుర్గ దేవి ఆలయం,శ్రీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర ఆలయంలో శ్రీ దేవీ నవరాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి.ఆలయ అర్చకులు మొలుగు శ్రీనివాసాచార్యులు,ఉగ్రదండి శివప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు కుంకుమ పూజ నిర్వహించారు.నేరేడుచర్ల పట్టణంతో పాటు మండలంలోని పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు.అనంతరం ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అందజేసిన తీర్థప్రసాదాలను స్వీకరించారు.దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా,అమ్మవారి దర్శనంతో భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. ఈ కార్యక్రమాలలో ఆలయ కమిటీ చైర్మన్ రాచకొండ రామకోటేశ్వరరావు, కొనతం ఆదిరెడ్డి, కొనతం సీతారాం రెడ్డి కొనతం రామిరెడ్డి, కొనతం శ్రీనివాస్ రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



# ఎరువు షాపును తనిఖీ చేసిన ఏడీఏ

తిరుమలగిరి అక్టోబర్12 (మనం న్యూస్) : తిరుమలగిరి మండలకేంద్రంలో ఎరువుల షాపులను ఏడిఏ తుంగతుర్తి ఎడిఎ రమేష్ బాబు సోమవారం తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్ లన,ఈపాస్ మిషన్ నీ తనిఖీ చేశారు. ఫెర్టిలైజర్ బుక్ చేసుకున్న రైతులకు మాత్రమే ఎరువులను అందించాలని ఆదేశించారు. అందరూ డీలర్లు ఫెర్టిలైజర్ యాక్ట్ సూచనలు పాటించాలని సూచించారు. ఆయన వెంట మండల వ్యవసాయ సిహెచ్ నాగేశ్వరరావు ఉన్నారు.

# నూర్ భాషా దూదేకుల ముస్లిం మైనార్టీ సంఘం ఎన్నిక

కోదాడ/ నడిగూడెం అక్టోబర్ 12 (మనం న్యూస్):తెలంగాణ నూర్ భాషా దూదేకుల ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘం ఎన్నికను రాష్ట్ర అధ్యక్షులు జేవీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ జనాబ్ సయ్యద్ భాష సమక్షాలు మండలంలోని వల్లాపురం గ్రామంలో ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా సయ్యద్ హుస్సేన్ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ ఖాసీం ఉపాధ్యక్షులుగా ఆదామ్ షరీఫ్ జాన్ పాషా షేక్ జానీ ప్రధాన కార్యదర్శి షేక్ సొందు పాషా ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ రహీం సైదులు సయ్యద్ మీరా కోశాధికారిగా షేక్ గాలిబ్ సహాయ కార్యదర్శి షేక్ పాషా సయ్యద్ మీరా మదర్ సాహెబ్ లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షులు సయ్యద్ హుస్సేన్ మాట్లాడుతూ నా ఈ ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు జానీ రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ లాల్ జాన్ పాషా రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ లాల్ సాహెబ్ కుసుమంచి మండల నాయకులు షేక్ సాయిబ్ హుస్సేన్ గ్రామ నాయకులు షేక్ ఖాదర్ బాబు ఖాజామియా కుల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.





# ప్రజావాణి దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి

## పోర్టల్‌లోఎప్పటికప్పుడు ఆన్‌లైన్ నమోదు చేయాలి

### జిల్లారెవెన్యూ అధికారి ప్రేమ్ రాజ్

సూర్యాపేట అక్టోబర్ 12 (మనం ప్రతినిధి) : ప్రజల సమస్యల పరిష్కారమే వేదికగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా రెవెన్యూ అధికారి ప్రేమ్ రాజ్ అన్నారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రతి సోమవారం జరుగు ప్రజావాణి కి జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని, ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా మండల స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. ప్రజావాణి పోర్టల్‌లో ఇంకా పరిష్కారం కాకుండా ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా రెవిన్యూ అధికారి తెలిపారు. కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను తక్షణమే పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని తెలిపారు. ప్రతి అధికారి తమ లాగిన్ లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అన్నారు. ప్రజలు పెట్టుకున్న అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా, నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. మండల స్థాయిలో ప్రారంభమైన ప్రజావాణి కి అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. మండల స్థాయి సమస్యలు స్థానికంగానే పరిష్కారమైతే ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయని ఆయన పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం లో భూ సమస్యలకి, రెవిన్యూ కి సంబందించి 36 దరఖాస్తులు, డిపిఓ 7, డి డబ్ల్యు ఓ 7, డిఇఓ 3 మిగిలిన 33 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవని, మొత్తం 86 దరఖాస్తులు వచ్చాయాని వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని డిఆర్ఓ అన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా పరిషత్ సీఈఓ శిరీష, డిఆర్డిఓ పిడి సన్యాసయ్య, డిఎంహెచ్వో వెంకటరమణ, డిఏఓ శ్రీధర్ రెడ్డి, జిల్లా స్పోర్ట్స్ అండ్ యూత్ వెల్ఫేర్ అధికారి వెంకటరెడ్డి, మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి , జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# మానవత్వం చాటుకున్న బీఆర్ఎస్ నేత క్యామ మల్లేష్

## బాధిత గొర్రెల కాపరి కుటుంబానికి రూ.50 వేల సాయం

బీబీనగర్: అక్టోబర్12, (మనం న్యూస్) : బీబీనగర్-ఘట్‌కేసర్ రైల్వే మార్గంలో కొండమడుగు మెట్టు సమీపంలో ఇటీవల దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొనడంతో సుమారు 400 గొర్రెలు మృత్యువాత పడిన ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ప్రమాదంలో జూలూరు అలీనగర్‌కు చెందిన గొర్రెల కాపరి కిష్టయ్య, ఆయన కుమారులు బాలయ్య, శేఖర్‌లకు చెందిన గొర్రెలు మృతి చెందడంతో ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక నష్టాన్ని ఎదుర్కొంటోంది. ఈ విషయం తెలుసుకున్న భువనగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి క్యామ మల్లేష్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో గొర్రెల కాపర్ల సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండెబోయిన అయోధ్య యాదవ్, యాదాద్రి భువనగిరి జిల్లా సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి సోము రమేష్ కురుమ, పోచంపల్లి మాజీ ఎంపీపీ మాద్గుల ప్రభాకర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పాక వెంకటేష్ యాదవ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాటి సుధాకర్ రెడ్డి, పోచంపల్లి పీఏసీఎస్ చైర్మన్ పాక మల్లేష్ యాదవ్, గొల్లకురుమ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు. రైలు ప్రమాదంలో భారీగా గొర్రెలను కోల్పోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం కూడా ఆదుకోవాలని గొర్రెల కాపర్ల సంక్షేమ సంఘం నాయకులు కోరారు.

# కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**2లక్షల ఉద్యోగాలు ఎక్కడ?**
**నిరుద్యోగులను నిట్టనిలువునా ముంచిన కాంగ్రెస్ పాలన**

**కాంగ్రెస్ పాలనకు పట్టభద్రులే బుద్ధి చెప్పాలి**

**పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయమే లక్ష్యంగా పనిచేయాలి**

**మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్**



కోదాడ, అక్టోబర్ 12(మనం న్యూస్): రాబోయే వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టభద్రుల ఓటరు నమోదు ప్రాధాన్యతను వివరించేందుకు కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ నడిగూడెం మండలం తెల్లబల్లి గ్రామంలో నడిగూడెం మండల నాయకులతో కలిసి ఓటరు నమోదు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా మండల నాయకులకు దిశానిర్దేశం చేస్తూ అర్హులైన ప్రతి పట్టభద్రుడిని గుర్తించి ఓటరుగా నమోదు చేయించే బాధ్యతను నాయకులందరూ సమన్వయంతో చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ అభ్యర్థి విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కంకణబద్ధులై పనిచేయాలని కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టభద్రుల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. ఓటర్ల నమోదు, పర్యవేక్షణ కోసం ప్రతి గ్రామంలో సమన్వయకర్తలను నియమించినట్లు తెలిపారు. గ్రామాలు, మండలాల వారీగా ప్రైవేట్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు, వైద్యులు, న్యాయవాదులు, బ్యాంకు ఉద్యోగులతో పాటు డిగ్రీ పూర్తి చేసి మూడేళ్లు నిండిన అర్హులైన పట్టభద్రులను కలిసి ఓటరుగా నమోదు చేయించాలని సూచించారు. గతంలో ఓటు నమోదు చేసుకున్నవారు సైతం తాజా ఓటరు జాబితా కోసం నిబంధనల ప్రకారం మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరాన్ని వారికి వివరించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు, నిరుద్యోగులు, యువత, ఉద్యోగుల సమస్యలపై ప్రజల్లో చర్చ జరగాలని బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని, ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలను ఆధారాలతో ఎండగట్టాలని పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సాధించే విజయం రాబోయే సాధారణ ఎన్నికలకు పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతుందని పేర్కొన్నారు. ప్రతి నాయకుడు, కార్యకర్తకు బాధ్యత గా సమష్టిగా పనిచేస్తే బీఆర్ఎస్ విజయానికి బలమైన పునాది వేయవచ్చని అన్నారు. పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేస్తూ అర్హులైన ప్రతి పట్టభద్రుడి ఓటు నమోదు పూర్తయ్యేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# మామునూరు విమానాశ్రయానికి దొడ్డి కొమురయ్య పేరు పెట్టాలి

**తెలంగాణ తొలి అమరవీరుడికి సముచిత గౌరవం కల్పించాలి**

**గొర్ల కాపరుల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోము రమేష్ కురుమ డిమాండ్**



బీబీనగర్: అక్టోబర్12, (మనం న్యూస్) : వరంగల్ జిల్లా మామునూరులో ఏర్పాటు చేస్తున్న విమానాశ్రయానికి తెలంగాణ తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య పేరు పెట్టాలని గొర్ల కాపరుల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోము రమేష్ కురుమ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో తొలి అమరవీరుడిగా గుర్తింపు పొందిన దొడ్డి కొమురయ్య త్యాగాలను ప్రభుత్వం గుర్తించి, ఆయనకు సముచిత గౌరవం కల్పించాలని కోరారు. భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం సాగిన పోరాటంలో దొడ్డి కొమురయ్య చేసిన త్యాగం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని సోము రమేష్ కురుమ పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల హక్కుల కోసం ప్రాణాలర్పించిన ఆయన సేవలను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో దొడ్డి కొమురయ్య పోషించిన పాత్రను గుర్తించి, మామునూరు విమానాశ్రయానికి ఆయన పేరు పెట్టడం ద్వారా తెలంగాణ చరిత్రకు, పోరాట స్ఫూర్తికి తగిన గుర్తింపు లభిస్తుందని అభిప్రాయపడ్డారు. తెలంగాణ కోసం పోరాడిన మహనీయుల పేర్లను ప్రముఖ ప్రభుత్వ సంస్థలు, ప్రజా ప్రాజెక్టులకు పెట్టడం ద్వారా వారి త్యాగాలను సమాజానికి మరింత చేరువ చేయవచ్చన్నారు. మామునూరు విమానాశ్రయానికి దొడ్డి కొమురయ్య పేరు పెట్టే అంశాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, తెలంగాణ తొలి అమరవీరుడికి తగిన గౌరవం కల్పించాలని సోము రమేష్ కురుమ విజ్ఞప్తి చేశారు.

# ఆసుపత్రికి వచ్చే పేషెంట్లకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలి

యాదాద్రి భువనగిరి జిల్లా అక్టోబర్ 12 (మనం ప్రతినిధి) : ఆస్పత్రికి వచ్చే పేషెంట్లకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. సోమవారం ఆత్మకూరు పీహెచ్‌సీని పరిశీలించిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు.. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో అందుతున్న వైద్య సేవలు, రోగుల నమోదు, మందుల లభ్యత, వైద్య పరీక్షలు, సిబ్బంది హాజరు తదితర అంశాలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య సేవలు మెరుగ్గా అందేలా చూడాలని, ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు.ఆసుపత్రికి వచ్చిన రోగులతో అదనపు కలెక్టర్ స్వయంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆత్మకూరు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని జిల్లా అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయానికి ఎంతమంది విధులకు హాజరు అయ్యారని అటెండన్స్ రిజిస్టర్ ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన

**వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగుపై సీఎం, సీఎస్ సూచనలు**



బీబీనగర్: అక్టోబర్12, (మనం న్యూస్) : తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన 'రైతు నేస్తం' ప్రత్యేక వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమం బీబీనగర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో జరిగింది. ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వాతావరణ పరిస్థితులు, వర్షపాతం అంచనాలు, వాటికి అనుగుణంగా చేపట్టాల్సిన వ్యవసాయ పద్ధతులు, సాగు చేయాల్సిన పంటలపై క్లస్టర్ పరిధిలోని రైతులకు ఈ కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో రైతులు ముందస్తు ప్రణాళికతో వ్యవసాయం చేయాలని, అందుబాటులో ఉన్న నీటి వనరులు, నేల స్వభావం, వర్షపాతం పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని పంటలను ఎంపిక చేసుకోవాలని ముఖ్యమంత్రి (సీఎం), ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సూచనలు చేసినట్లు కార్యక్రమంలో వివరించారు. వర్షాలు ఆలస్యమైనా, సాధారణం కంటే తక్కువగా కురిసినా పంటలపై ప్రభావం పడకుండా ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి పొదుపు చర్యలు, పంటల యాజమాన్య పద్ధతులపై రైతులు అవగాహన పెంచుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. ఎల్‌నినో ప్రభావం కారణంగా వాతావరణంలో చోటుచేసుకునే మార్పులను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ శాఖ సూచనలను పాటించాలని, స్థానిక వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగుపై నిర్ణయాలు తీసుకోవాలని రైతులకు సూచించారు. పంటల ఎంపిక, విత్తనాల వినియోగం, సాగునీటి నిర్వహణ వంటి అంశాల్లో వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకోవడం ద్వారా నష్టాలను తగ్గించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజాపరిషత్ సీఈఓ శోభారాణి, ఎమ్మెల్సో హరికృష్ణ, మండల విద్యాశాఖ అధికారిణి పద్మ, మండల ప్రజాపరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ హరి శివకుమార్, పంచాయతీ కార్యదర్శులు, క్లస్టర్ పరిధిలోని గ్రామాల రైతులు పాల్గొన్నారు. వాతావరణ మార్పులపై ముందస్తు అవగాహనతో సాగు ప్రణాళికలు రూపొందించుకోవడానికి రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ ఉపయోగపడుతుందని కార్యక్రమంలో పేర్కొన్నారు.



## కిరాణా షాపును ప్రారంభించిన గ్రామ సర్పంచ్ ఎల్లయ్య

**గ్రామీణ ప్రాంతాల్లో వ్యాపారాల అభివృద్ధి అభినందనీయం: దాయం ఝాన్సీ రాజిరెడ్డి**

తుంగతుర్తి, అక్టోబర్ 12 (మనం న్యూస్) : మండల పరిధిలోని వెంపటి గ్రామంలో మాజీ సర్పంచ్ కొండగడుపుల నాగయ్య నూతనంగా ఏర్పాటు చేసిన కిరాణా షాపును గ్రామ సర్పంచ్ తప్పట్ల ఎల్లయ్య రాజిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దాయం ఝాన్సీ రాజిరెడ్డి తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా షాపు నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపి, వ్యాపారంలో మంచి అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.గ్రామీణ ప్రాంతాల్లో చిన్నచిన్న వ్యాపారాలు స్థానిక ప్రజలకు నిత్యావసర వస్తువులను అందించడంతో పాటు ఉపాధి అవకాశాలను కూడా కల్పిస్తాయని పేర్కొన్నారు. నూతనంగా వ్యాపారం ప్రారంభించిన నిర్వాహకులు వినియోగదారులకు నాణ్యమైన వస్తువులను అందిస్తూ, ప్రజల ఆదరాభిమానాలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచి దాసరి మంజుల రామచంద్రు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సగ్గం నరసయ్య, మాజీ సర్పంచ్ అబ్బగాని పద్మ సత్యనారాయణ గౌడ్,వార్డు సభ్యులు,గ్రామ పెద్దలు, వివిధ పార్టీల నాయకులు, వ్యాపారులు, యువకులు తదితరులు పాల్గొని షాపు నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

# వినియోగదారుల హక్కులపై చైతన్యం అవసరం

**ఉమ్మడి నల్గొండ జిల్లా సమన్వయ కమిటీ సమావేశం : డీసీ ఎస్ఓ**

చందూర్, అక్టోబర్ 12, మనం న్యూస్ : సోమవారం నల్లగొండ జిల్లా కలెక్టరేట్ లోని డిసిఐసి కార్యాలయంలో ఉమ్మడి నల్గొండ జిల్లా వినియోగదారుల సంఘాల సమన్వయ కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు అన్నబోయిన మట్టయ్య అధ్యక్షతన జరిగినది ఈ కార్యక్రమానికిచందూరు నుండి జిల్లా కమిటీ సభ్యులు డివిజన్ మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నల్లగొండ టిసిఎస్ఓ వెంకటేష్ మాట్లాడుతూ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తూనికలు కొలతలు శాఖ జిల్లా అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ వినవదారుల సంఘాల ప్రతినిధులు ప్రజలలో అవగాహన చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లా ట్రగ్ ఇన్స్పెక్టర్ సంపత్ కుమార్ మాట్లాడుతూ వినియోగదారుల సంఘాల ప్రతినిధులు ఇనాగదారుల హక్కుల కోసం చేస్తున్న కృషిని వారు చేస్తున్న సేవలను అభినందించారు. క్యాట్కో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏలే వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వినియోగదారుల సొసైటీలకు సంక్షేమ నిధి కోసం నీతి రిజిస్ట్రేషన్ పై అవగాహన కల్పించారు. అనంతరం పిలవదారుల ఫోరం జిల్లా అధ్యక్షులు ఏ హిమగిరి ప్రథమ సంవత్సరికం సందర్భంగా ఘన నివాళులర్పించారు. ఈ సమావేశంలో డిసిఐసి జిల్లా కన్వీనర్లు చింతమల్ల గురువయ్య, పిల్లలమర్రి వెంకటేశ్వర్లు, కొదారి వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి కట్ట మనోహర్, జిల్లా ఉపాధ్యక్షులు ఎండి ఆస్మా మహమ్మద్ ముస్తఫా, జిల్లా సహాయ కార్యదర్శి పసునూరి రాంబాబు, తిరందాసు ఆంజనేయులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ దువ్వ గీత, మిర్యాలగూడ డివిజన్ కన్వీనర్ సాంబశివరావు, చండూర్ డివిజన్ కన్వీనర్ గందూరి నరసింహ, జిల్లా కార్యవర్గసభ్యులు జూలూరు వెంకటేశం,తందారి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.






## సీఐ సూర్య నాయక్, ఎస్ఐ తేజ రెడ్డికి బీజేపీ నాయకుల సన్మానం

బీబీనగర్: అక్టోబర్12, (మనం న్యూస్) : మండల బీజేపీ అధ్యక్షుడు భువనగిరి సదానంద గౌడ్ ఆధ్వర్యంలో మండల పోలీస్ స్టేషన్ సీఐ సూర్య నాయక్, ఎస్ఐ తేజారెడ్డిలను బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులకు అభినందనలు తెలియజేసి, మర్యాదపూర్వకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బోయపల్లి గోపాల్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు ముష్కి సుధాకర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు సురకంటి హరిప్రసాద్ రెడ్డి, మండల బీజేపీ ప్రధాన కార్యదర్శులు కాసుల శ్రీకాంత్ గౌడ్, గూడూరు శ్రీనివాస రెడ్డి, సోషల్ మీడియా ప్రతినిధులు నకిర్తి శ్రీకాంత్, నిమ్మల శివ పాల్గొన్నారు.



## వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా పంటలు సాగు చేయాలి

సంస్థాన్ నారాయణపురం, అక్టోబర్ 12, మనం న్యూస్: వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా పంటలు సాగు చేయాలని సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రైతులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో వ్యవసాయ శాఖ అధికారులు సూచించినట్లు మండల వ్యవసాయ అధికారి పూజ తెలిపారు. ఎల్నినో ప్రభావం వల్ల వాతావరణంలో చోటు చేసుకునే మార్పులు, రబీ సీజన్ పై వాటి ప్రభావం, పంటల సాగుకు పంటల ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు పలు అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ లో రైతులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా పంటలు సాగు చేసుకుంటే రైతులకు జరిగే నష్టాలను కొంతమేర అరికట్టవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి, మహమ్మదాబాద్ సర్పంచ్ ముత్యాల అంజయ్య, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రమోద్ కుమార్, ఎంపీఓ నవీన్, విద్యుత్ ఏఈ దివ్య, హౌసింగ్ ఏఈ శివ సాయి, ఏపిఎం శ్రీదేవి, జిపిఓ వెంకన్న, మండల వ్యవసాయ విస్తరణ అధికారులు సైదులు, త్రివేణి, అనురాధ, నవ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కందుకూరి ఈశ్వరమ్మ లక్ష్మయ్య 10వ వర్ధంతి

తిరుమలగిరి అక్టోబర్ 12 (మనం న్యూస్) : పీడిత ప్రజల కోసం స్వర్ణకారుల సమస్యలపై పోరాటం చేసినటువంటి అమరవీరులు కందుకూరి ఈశ్వరమ్మ లక్ష్మయ్య పదవ వర్ధంతిని మండలంలోని తాటిపాముల గ్రామం లో సోమవారం నిర్వహించారు. వారి చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. సింగిల్ విండో మాజీ చైర్మన్ కారుపోతుల అంజయ్య, మాట్లాడుతూ సిపిఎం పార్టీకి స్వర్ణకార సంఘానికి వారు ఎనలేని కృషి చేశారని వారు కొనియాడారు. కందుకూరి ఈశ్వర మ్మ సింగిల్ విండో డైరెక్టర్ గా ఉండి



రైతులకు రుణాలు ఇప్పించారని చెప్పారు. మన నుంచి దూరమై 10 సంవత్సరాలు గడుస్తున్నా మా ఉద్యమంలో ఉంటారని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు గర్దాస్ చంద్ర నారాయణ, కల్లుగీత కార్మిక సంఘం మాజీ అధ్యక్షుడు భూపతి నారాయణ, టైలర సంఘం తిరుమలగిరి మండల ఉపాధ్యక్షుడు దోర్నాల కృష్ణయ్య, కందుకూరి కాంతయ్య, నర్మదా, పాల్గొన్నారు.

# తుంగతుర్తి ప్రజావాణిలో అధికారులేరి?

**మధ్యాహ్నం 12 గంటలు దాటిన కార్యాలయంలో కనిపించని పలువురు అధికారులు**

**ప్రజల ఫిర్యాదులకు స్పందించేది ఎవరు**

**ప్రజావాణికి ఒక్క అధికారే దిక్కు**

**ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పెద్దపీట.. తుంగతుర్తిలో మాత్రం అరకొర నిర్వహణ!**




**అన్ని శాఖల అధికారులు ఉండాల్సిన చోట ఒక్కరితోనే దరఖాస్తుల స్వీకరణ.. ప్రజావాణి నిర్వహణపై ప్రజల్లో చర్చ!**

తుంగతుర్తి, అక్టోబర్ 12, (మనం న్యూస్): ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని, వాటికి పరిష్కారం చూపాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజావాణి కార్యక్రమం తుంగతుర్తి మండలంలో ఆశించిన స్థాయిలో నిర్వహించడంలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రజావాణిని ఆశ్రయిస్తుండగా, అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండాల్సిన కార్యక్రమంలో ఒక్క అధికారి మాత్రమే దరఖాస్తులు స్వీకరిస్తుండటం చర్చనీయాంశంగా మారింది.

**ప్రజా సమస్యలకు పరిష్కారం ఎక్కడ?**

ప్రజావాణి కార్యక్రమం ద్వారా భూ సమస్యలు, పింఛన్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, విద్యుత్, వ్యవసాయం, గ్రామపంచాయతీ, రెవెన్యూ తదితర శాఖలకు సంబంధించిన సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉంటుంది. ఇందుకోసం వివిధ గ్రామాల నుంచి ప్రజలు మండల కేంద్రానికి వచ్చి తమ సమస్యలపై అర్జీలు సమర్పిస్తుంటారు. అయితే ఆయా శాఖలకు సంబంధించిన అధికారులు అందుబాటులో లేకపోతే, దరఖాస్తుదారుల సమస్యలను వెంటనే పరిశీలించడం, సంబంధిత శాఖకు వివరించడం వంటి ప్రక్రియలకు ఆటంకం కలిగే అవకాశం ఉంది.

**ప్రతిష్టాత్మక కార్యక్రమానికి ప్రాధాన్యత ఏది?**

ప్రభుత్వం ప్రజలకు పాలనను చేరువ చేయాలనే ఉద్దేశంతో ప్రజావాణికి ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో, క్షేత్రస్థాయిలోనూ అదే స్థాయిలో నిర్వహణ ఉండాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అన్ని శాఖలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి వేదికగా నిలవాల్సిన కార్యక్రమంలో సంబంధిత అధికారులు అందుబాటులో లేకపోవడంపై ప్రజలు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు.

**అధికారుల పర్యవేక్షణ అవసరం!**

ప్రజావాణి కార్యక్రమం కేవలం దరఖాస్తుల స్వీకరణకే పరిమితం కాకుండా, వాటి పరిష్కారానికి కార్యాచరణ చేపట్టే విధంగా నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి సంబంధిత శాఖల అధికారులు హాజరయ్యేలా ఉన్నతాధికారులు పర్యవేక్షించాలని, అందిన దరఖాస్తులపై నిర్ణీత సమయంలో చర్యలు తీసుకొని దరఖాస్తుదారులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా చేపట్టిన ప్రజావాణి కార్యక్రమం తుంగతుర్తి మండలంలో పూర్తిస్థాయిలో నిర్వహించేందుకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.





## కాంగ్రెస్ పాలనకు పట్టభద్రులే బుద్ధి చెప్పాలి

**పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయమే లక్ష్యంగా పనిచేయాలి**

**మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్**

అనంతగిరి అక్టోబర్ 12 (మనం న్యూస్) : ఉమ్మడి వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మండల పార్టీ అధ్యక్షులు నల్ల భూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో పట్టభద్రుల ఓటరు నమోదు సన్నాహక సమావేశం మండలంలోని చనుపల్లి గ్రామంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ పాల్గొని మాట్లాడుతూ అర్హులైన ప్రతి పట్టభద్రుడిని గుర్తించి ఓటరుగా నమోదు చేయించే బాధ్యతను నాయకులందరూ సమన్వయంతో చేపట్టాలని కోరారు. బీఆర్ఎస్ అభ్యర్థి విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కంకణబద్ధులై పనిచేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టభద్రుల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. ఓటర్ల నమోదు, పర్యవేక్షణ కోసం ప్రతి గ్రామంలో సమన్వయకర్తలను నియమించినట్లు తెలిపారు. గ్రామాలు, మండలాల వారీగా ప్రైవేట్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు, వైద్యులు, న్యాయవాదులు, బ్యాంకు ఉద్యోగులతో పాటు డిగ్రీ పూర్తి చేసి మూడేళ్లు నిండిన అర్హులైన పట్టభద్రులను కలిసి ఓటరుగా నమోదు చేయించాలని సూచించారు. గతంలో ఓటు నమోదు చేసుకున్నవారు సైతం తాజా ఓటరు జాబితా కోసం నిబంధనల ప్రకారం మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరాన్ని వారికి వివరించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు, నిరుద్యోగులు, యువత, ఉద్యోగుల సమస్యలపై ప్రజల్లో చర్చ జరగాలని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని, ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలను ఆధారాలతో ఎండగట్టాలని పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సాధించే విజయం రాబోయే సాధారణ ఎన్నికలకు పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతుందని పేర్కొన్నారు. ప్రతి నాయకుడు, కార్యకర్తకు బాధ్యతగా సమష్టిగా పనిచేస్తే బీఆర్ఎస్ విజయానికి బలమైన పునాది వేయవచ్చని అన్నారు. పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేస్తూ అర్హులైన ప్రతి పట్టభద్రుడి ఓటు నమోదు పూర్తయ్యేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మట్టపల్లి సైదులు అఫ్జల్ మోషే ఐతబోయిన వెంకటేశ్వర్లు మట్టపల్లి పుల్లయ్య గౌడ్ ధన్వంత రెడ్డి కలకొండ లచ్చయ్య నరసింహారావు సైదులు శివ మండల నాయకులు గ్రామ శాఖ అధ్యక్షులు ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వర మహాలక్ష్మి కాటన్ మిల్లు' ప్రారంభం

**ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**



చండూరు,.. అక్టోబర్ 12:మనం న్యూస్: చండూరు మండలం తాస్కానిగూడెం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'శ్రీ వర మహాలక్ష్మి కాటన్ మిల్లు'ను మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మిల్లుయూనిట్‌ను పరిశీలించి, నిర్వాహకులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. స్థానికంగా వ్యాపార, వాణిజ్య రంగాలు అభివృద్ధి చెందడం వల్ల ప్రజలకు ఆర్థికంగా ఎంతో మేలు జరుగుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అంతేకాకుండా, ఇలాంటి పరిశ్రమలు మరియు వ్యాపార సంస్థలు అందుబాటులోకి రావడం ద్వారా స్థానిక యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని అభిప్రాయపడ్డారు. పట్టణ మరియు గ్రామీణ ప్రాంతాల్లో నూతన సంస్థల ఏర్పాటు ప్రాంతీయ అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని ఆయన అన్నారు. శ్రీ వర మహాలక్ష్మి కాటన్ మిల్లు వ్యాపార రంగంలో ఉత్తమ గుర్తింపు తెచ్చుకోవాలని, భవిష్యత్తులో నిర్వాహకులు మరిన్ని విజయాలు సాధించి మరింత అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం స్థానికంగా ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో చండూరు మున్సిపల్ చైర్మన్ కోడి శ్రీనివాసులు, గ్రామ సర్పంచ్, మాజీ సర్పంచ్ కోడి గిరిబాబు, వెంకన్న, వివిధ మండల మరియు పట్టణ అధ్యక్షులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, పెద్ద సంఖ్యలో ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు తిప్పర్తి విద్యార్థిని




నల్గొండ -అక్టోబర్ 12( మనం న్యూస్) : తిప్పర్తి మండల కేంద్రంలోని పీఎం జెడ్‌పీహెచ్‌ఎస్ పాఠశాలకు చెందిన పి. ప్రణీత ఎస్‌జీఎఫ్ఐ అండర్-19 బాలికల కబడ్డీ విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ నిమ్మల లెనిన్ బాబు తెలిపారు. ఈ నెల 12, 13, 14 తేదీల్లో సంగారెడ్డి జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రణీత నల్గొండ జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించనుందని పేర్కొన్నారు. కబడ్డీ క్రీడలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైన ప్రణీతను తిప్పర్తి మండల విద్యాధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహ నాయక్, సీనియర్ ఉపాధ్యాయులు నర్ర దామోదర్ రెడ్డి, గంజి జ్యోతి, హేమీమా, పద్మలత, భైరం శ్రీనివాస్, జ్యోతిర్మయి, ఇతర ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ప్రణీత ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, నల్గొండ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# 50వేల మంది పాఠశాల విద్యార్థులకు అల్పాహార పథకం ద్వారా ప్రయోజనం

**దివీస్ సహకారం 12 కోట్ల 18 లక్షల 62వేలు**

**హెచ్‌కెఎం ఛారిటబుల్ ఫౌండేషన్ అధ్యక్షులు శ్రీ సత్యగౌరచంద్రదాస స్వామీజీ**

చౌటుప్పల్, అక్టోబర్ 12(మనం న్యూస్) : చౌటుప్పల్ మున్సిపాలిటీలోని లింగోజిగూడెం గ్రామంలోని దివీస్ లాబోరేటరీస్ లిమిటెడ్ సీఎస్ఆర్ సహకారంతో 50వేల మంది పాఠశాల విద్యార్థులకు అల్పాహార పథకం ద్వారా ప్రయోజనం కలుగుతుందని హెచ్‌కెఎం ఛారిటబుల్ ఫౌండేషన్ అధ్యక్షులు శ్రీ సత్యగౌరచంద్రదాస స్వామీజీ, సీఈఓ







శ్రీ కౌంతీయదాస స్వామీజీ, శ్రీ కృష్ణ ప్రేమదాస స్వామీజీ, శ్రీ సద్గుణ భక్త దాస స్వామీజీలు అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలోని తంగడపల్లి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన అల్పాహారం అందించాలనే లక్ష్యంతో అక్షయపాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం తంగడపల్లి గ్రామంలో చేపట్టనున్న వంటశాల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ ప్రాజెక్టుకు దివీస్ పరిశ్రమ సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా రూ.12 కోట్ల 18 లక్షల 62 వేల ఆర్థిక సహకారం అందిస్తుందని తెలిపారు. ఈ భూమిపూజ కార్యక్రమంలో దివీస్ పరిశ్రమ మేనేజర్ బి.కిశోర్ పాల్గొన్నారు. విద్యార్థులకు పోషక విలువలతో కూడిన అల్పాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యం మెరుగుపర్చడంతోపాటు చదువుపై ఏకాగ్రత పెంపొందించేందుకు ఈ పథకం ఎంతో దోహదపడుతుందన్నారు. విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి పౌష్టికాహారం ఎంతో అవసరమన్నరు. ఈ లక్ష్యంతో చేపడుతున్న వంటశాల నిర్మాణం, పాఠశాల విద్యార్థుల సంక్షేమానికి తోడ్పడుతుందని తెలిపారు. సామాజిక అభివృద్ధి, విద్యార్థుల ఆరోగ్యం, విద్యకు ప్రాధాన్యతనిస్తూ దివీస్ లాబోరేటరీస్ లిమిటెడ్ సంస్థ అందిస్తున్న ఈ ఆర్థిక సహకారం ఎంతో ప్రశంసనీయమన్నారు. అక్షయపాత్ర ఫౌండేషన్ చేపడుతున్న ఈ కార్యక్రమం వేలాది మంది విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తుందని పేర్కొన్నారు.



## చండూరులో వైభవంగా శరన్నవరాత్రులు

### రెండో రోజు గాయత్రీ దేవిగా భక్తులను అనుగ్రహించిన దుర్గమ్మ

చండూరు, అక్టోబర్ 12 (మనం న్యూస్) : చండూరు పట్టణంలోని చారిత్రాత్మక శ్రీ మార్కండేశ్వర స్వామి దేవాలయంలో శరన్నవరాత్రు ఉత్సవాలు అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక శోభతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజైన సోమవారం అమ్మవారు సర్వవిద్యల స్వరూపిణి అయిన గాయత్రీ మాత అలంకారంలో భక్తులకు అభయమిస్తూ దివ్యదర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు చండూరు పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. విద్యుత్ కాంతులతో దేదీప్యమానంగా దేవాలయం శరన్నవరాత్రుల వేడుకల పురస్కరించి మార్కండేశ్వర స్వామి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. రాత్రివేళల్లో రంగురంగుల విద్యుత్ దీపాలంకరణలు దేవాలయానికి మరింత శోభను తెచ్చాయి. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చే భక్తులను ఈ విద్యుత్ కాంతులు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

### చేనేత కళాకారుల ప్రత్యేక నివాళి - మగ్గంపై నేసిన పట్టు వస్త్రాలు సమర్పణ

చండూరు ప్రాంతం చేనేత కార్మికులకు ప్రసిద్ధి చెందిందనే నిదర్శనంగా, స్థానిక చేనేత కళాకారులు తమ ప్రత్యేక భక్తిభావాన్ని చాటుకున్నారు. స్వయంగా తమ మగ్గాలపై ఎంతో శ్రమించి, అత్యంత నైపుణ్యంతో నేసిన ప్రత్యేక పట్టు వస్త్రాలను అమ్మవారికి సమర్పించారు. ఈ పట్టు చీరలో గాయత్రీ మాత దివ్యరూపం మరింత తేజోవంతంగా విరాజిల్లింది. స్థానిక చేనేత కార్మికుల ఈ వినూత్న భక్తికి దేవాలయ కమిటీ సభ్యులు భక్తులు అభినందనలు తెలిపారు. దేవాలయ ప్రాంగణం అంతా మహిళా భక్తులచేకొలాహలంగా మారింది. సాయంత్రం వేళలో అమ్మవారి పూజా కార్యక్రమం నిర్వహించగా, మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారి సంకీర్తనలో పాల్గొన్నారు. దేవాలయ ప్రాంగణమంతా కూడా సాక్షాత్తు విజయవాడ నుండి ఆ అమ్మవారి ప్రత్యక్షం అయ్యిందా అన్నట్టుగా కనుల పండుగగా ఉన్నది. కార్యక్రమాల అనంతరం దేవాలయ నిర్వాహకులు భక్తజనానికి తీర్థప్రసాదాలు అందజేశారు. దేవాలయ నిర్వాహకులు అర్చకులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి కూడా ఆ జగన్మాత ఆశీస్సులు ఉండాలని అందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు..

## వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా

# త్రిబుల్ ఆర్ రెస్టారెంట్ అండ్ హోటల్ ప్రారంభం

చౌటుప్పల్, అక్టోబర్ 12(మనం న్యూస్) : వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా రుచికరమైన శాకాహార, మాంసాహార ఆహార పదార్థాలు అందించడానికి త్రిబుల్ ఆర్ రెస్టారెంట్ అండ్ హోటల్ ప్రాధాన్యత ఇస్తుందని హోటల్ నిర్వాహకులు గోపి మహేష్, గోపి కిరణ్, బండిగారి రాజలింగం తెలిపారు. చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం సమీపం హైదరాబాద్ వైపు రోడ్డులో భారీ త్రిబుల్ ఆర్ రెస్టారెంట్ అండ్ హోటల్ ను సోమవారం ప్రముఖ పారిశ్రామికవేత్త రిక్కల గోపాల్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా హోటల్ యజమానులు మాట్లాడుతూ దినదిన అభివృద్ధి చెందుతున్న కొయ్యలగూడెం జాతీయ రహదారిపై మంచి హోటల్ రెస్టారెంట్ స్థాపించడం జరిగిందని పేర్కొన్నారు. ఎంతో అనుభవజ్ఞులైన వంట మాస్టర్ , స్టార్ హోటల్ ను తలపించేలా డైనింగ్ హాల్స్, విశాలమైన పార్కింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కుటుంబ సమేతంగా భోజనం చేసే విధంగా విశాలమైన హాళ్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. స్టార్ హోటల్ మాదిరిగా ఉన్న త్రిబుల్ ఆర్ లో సాధారణ హోటల్ ధరల్లోనే టిఫిన్స్, భోజనాలు అన్ని రకాల ఆహార పదార్థాలు అందిస్తామని తెలిపారు. నూతన హోటల్ యజమాన్యాన్ని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.





## దొండపాడులో రెండో రోజు గాయత్రి దేవి అవతారం

చింతలపాలెం అక్టోబర్ 12 (మనం న్యూస్) : మండల పరిధిలోని దొండపాడు గ్రామంలోనీ బొడ్రాయి వద్ద గల అమ్మవారి మండపంలో రెండవ రోజైన గాయత్రి దేవి అవతారంలో దర్శనమిస్తున్న శ్రీ కనకదుర్గమ్మ తల్లి రెండవ రోజున దొండపాడు గ్రంథాలయ చైర్మన్ వేల్పుల హనుమారెడ్డి దంపతులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో డీకే యూత్ అధ్యక్షుడు సోషల్ మీడియా కన్వీనర్ దొంగల కార్తిక్, మరియు డీకే యూత్ సభ్యులు టీం మహాశక్తి యూత్ సభ్యులు మహిళా సోదరీమణులు భక్తులు పాల్గొన్నారు



# రైతాంగానికి 12 గంటల విద్యుత్ సరఫరా చేయాలి

**ఏపూరు రామన్నగూడెం సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా**



ఆత్మకూరు ఎస్ అక్టోబర్ 12 మనం న్యూస్ : రైతాంగానికి ఒకే దఫాగా న్యాయమైన 12 గంటల విద్యుత్ సరఫరా చేయాలని, లో వోల్టేజీ సమస్యను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో మండల పరిధిలోని ఏపూరు రామన్న గూడెం సబ్‌స్టేషన్ ఎదుట సోమవారం రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్నాను ఉద్దేశించి జిల్లా అధ్యక్షులు కునుకుంట్ల సైదులు మాట్లాడుతూ.. రైతులు భూమిని నమ్ముకొని ఆరుగాలం కష్టపడి, చెమటోడ్చి, అప్పులు చేసి పెట్టుబడు ఓలు పెట్టి పంటలు సాగు చేస్తున్నారని అన్నారు. తీరా పంట చేతికొచ్చే సమయంలో ప్రభుత్వం సక్రమంగా, న్యాయంగా విద్యుత్ సరఫరా చేయకపోవడంతో పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లో వోల్టేజీ సమస్య కారణంగా వ్యవసాయ మోటార్లు, స్టార్టర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని, దీంతో రైతులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం, సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి రైతులకు కలుగుతున్న నష్టాన్ని నివారించేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఏపూరు రామన్నగూడెం సబ్‌స్టేషన్ పరిధిలో థర్డ్ ఫీడర్ మంజూరై సంవత్సరం గడుస్తున్నప్పటికీ ఇప్పటివరకు పనులు పూర్తి చేయకపోవడం వల్ల రైతులు లో వోల్టేజీ సమస్యతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి థర్డ్ ఫీడర్ పనులను పూర్తి చేయాలని కోరారు. రైతులకు ఒకే దఫాగా న్యాయమైన 12 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని, విద్యుత్ సమస్యల కారణంగా పంటలు ఎండిపోయి నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించే వరకు ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యం చేయకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ దాసరి శ్రీనివాస్, జిల్లా నాయకులు ఎస్.కె జిలేరు, ఎస్.కె మైబిల్లి, కొండేటి సంజీవరెడ్డి, అరుణోదయ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి కాంచనపల్లి సైదులు, ఎర్ర ఉమేష్, బత్తిని ఎల్లయ్య, సుధగాని రవి, గోపాల్ మాసిరెడ్డి, బోలక బిక్షం, చిత్తలూరి వెంకన్న, వీరారెడ్డి, సుధగాని వెంకన్న, వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## మార్కెట్ కార్మికులకు ఏకరూప దుస్తుల పంపిణీ

సూర్యాపేట టౌన్, అక్టోబర్ 12, మనం న్యూస్ సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ లోని దాడువాయిలు, హమాలీలు, స్వీపర్లు, ఆడకూలీలకు ఏకరూప దుస్తులను మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ అభివృద్ధితో పాటు అక్కడ పనిచేస్తున్న కార్మికుల సంక్షేమం కూడా ముఖ్యమని స్పష్టం చేశారు. కార్మికులకు అవసరమైన సహకారం అందిస్తూ, వారి అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని తెలిపారు. కార్మికులకు యూనిఫాంల పంపిణీ చేయడం ద్వారా విధుల్లో ఏకరూపత, గుర్తింపు పెంపొందించడంతో పాటు వారిని ప్రోత్సహించే ప్రయత్నం చేస్తున్నట్లు పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ పరిధిలో రైతులు, వ్యాపారులు, కార్మికులకు మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు. అంతకుముందు మార్కెట్ లో నూతనంగా నిర్మించే గల్వాల్యూమ్ షెడ్ కు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి ఎండి ఫసియోద్దిన్, సిబ్బంది, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ ఎండి షఫీ ఉల్లా, మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు, అడ్తి అసోసియేషన్, అపరాల అసోసియేషన్, ట్రేడర్స్ అసోసియేషన్, మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులు, హమాలి కార్మికులు, స్వీపర్లు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

# రబీలో వరి పంటసాగును పూర్తిగా తగ్గించాలి

**వీసీలో రైతులకు సూచనలు చేసిన వ్యవసాయ శాఖ మంత్రి**

**వీడియో కాన్ఫరెన్స్ ను వీక్షించిన రైతులు**



పెన్ పహాడ్ అక్టోబర్ 12 (మనం న్యూస్): యల్ నీలో ప్రభావం వల్ల వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో రానున్న రబీ సీజన్లో రైతులు వరి పంట సాగును పూర్తిగా తగ్గించాలని తక్కువ నీటితో సాగాయ్యే మెట్ట పంటలను సాగు చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన వ్యవసాయ శాఖ వీడియో కాన్ఫరెన్స్లో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఖరీఫ్ సీజన్లో వరి పంట సాగు చేసిన రైతులకు నీరు అందక ఇబ్బందులు పడుతున్నారని గుర్తించిన ప్రభుత్వం రవి సీజన్లో పెసర మినుములు బొబ్బర్లు ఉలవలు లాంటి మెట్టపంటలతో పాటు కూరగాయల సాగు నూనె గింజల పంటలైన వేరుశనగ సాగు చేసుకోవాలని రైతులకు సూచించారు నీటిని వృధా చేసుకోవద్దని రానున్న కాలం గడ్డు కాలంగా ఉంటుందని తెలిపారు అందువల్ల వ్యవసాయ శాఖ అధికారుల సూచన పాటించాలని కోరారు ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లై అధికారి శ్రీధర్ రెడ్డి, స్థానిక తహసిల్దార్ గుమ్మి రాజశేఖర్ రెడ్డి, ఎంపీడీవో జానయ్య, మండల వ్యవసాయ అధికారి అనిల్ కుమార్, ఆర్ఐ రంజిత్ రెడ్డి, జిపిఓలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు...

## విద్యుత్ కోతలతో ఎండిపోతున్న పంటలు..

# జనరేటర్‌తో సాగునీరు

**ఐదు ఎకరాల్లో రెండు ఎకరాల పంట ఎండిపోయింది**

**మిగిలిన పంటను కాపాడుకునేందుకు లక్ష రూపాయల ఖర్చుతో జనరేటర్ ఏర్పాటు**



ఆత్మకూర్ ఎస్ అక్టోబర్ 12 మనం న్యూస్ : మండల పరిధిలోని రామన్నగూడెం సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న నసింపేట గ్రామంలో విద్యుత్ సరఫరా సక్రమంగా లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామానికి చెందిన రైతు బట్టుపల్లి శ్రీనివాస్ తన ఐదు ఎకరాల వ్యవసాయ భూమిలో సాగు చేసిన పంటకు నీరందించేందుకు నానా అవస్థలు పడుతున్నారు. విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో ఇప్పటికే రెండు ఎకరాల పంట ఎండిపోగా, మిగిలిన మూడు ఎకరాల పంటను కాపాడుకునేందుకు సుమారు లక్ష రూపాయలు వెచ్చించి మాగ్నెట్ జనరేటర్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. ప్రభుత్వం వ్యవసాయానికి రోజుకు 12 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు చెబుతున్నప్పటికీ, తమకు సుమారు ఎనిమిది గంటలు మాత్రమే విద్యుత్ అందుతోందని, అది కూడా నిర్ణీత సమయానికి రావడం లేదని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. దీంతో ట్రాక్టర్ సహాయంతో జనరేటర్‌ను నడుపుతూ రోజుకు సుమారు 10 లీటర్ల డీజిల్ ఖర్చు చేసి మిగిలిన పంటకు నీరు అందించుకుంటున్నట్లు తెలిపాడు.

**గతంలో సాగునీటికి ఇబ్బందులు ఉండేవి కావు**

గత ప్రభుత్వ హయాంలో 12 గంటల విద్యుత్‌తో పాటు కాలువల ద్వారా సాగునీరు అందడంతో రైతులు సంతోషంగా వ్యవసాయం చేసుకునేవారని శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యుత్ సరఫరా సక్రమంగా లేక పంటలు ఎండిపోయే దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. పంటను కాపాడుకోవడానికి అదనపు ఖర్చులు భరించాల్సి వస్తోందని వాపోయారు.

**అధికారులు స్పందించాలి**

వ్యవసాయానికి అవసరమైన విద్యుత్‌ను నిర్ణీత సమయాల్లో నిరంతరాయంగా సరఫరా చేసి, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని బట్టుపల్లి శ్రీనివాస్ విద్యుత్ శాఖ అధికారులను, ప్రభుత్వాన్ని కోరారు. సాగు సమయంలో విద్యుత్ అంతరాయాలు లేకుండా చర్యలు తీసుకొని, రైతుల పంటలు ఎండిపోకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

# నల్లగొండ రెడ్‌క్రాస్‌కు తొలి మహిళా చైర్‌పర్సన్‌గా డాక్టర్ హేమలత

**హేమలత ప్యానెల్‌కు 8, అమరేందర్ రెడ్డి ప్యానెల్‌కు 7 స్థానాలు**

**కీలక పదవులకు ఏకగ్రీవ ఎంపిక**

నల్లగొండ –అక్టోబర్ 12 (మనం ప్రతినిధి) : నల్గొండ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి నూతన నాయకత్వం కొలువుదీరింది. సుమారు 12 ఏళ్ల తర్వాత ఎన్నికల ద్వారా కార్యవర్గం ఏర్పడింది. చరిత్రలో తొలిసారి మహిళా చైర్‌పర్సన్‌గా డాక్టర్ హేమలత ఎన్నికై రికార్డు సృష్టించారు. (అక్టోబర్ 11) నిర్వహణ కమిటీ సభ్యుల ఎన్నికలు జరగ్గా, సోమవారం కీలక పదవుల ఎంపిక పూర్తయింది. మొత్తం 1,385 మంది ఓటర్లు ఉండగా 32 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. 1,003 మంది ఓటు వేయగా, 30 ఓట్లు చెల్లనివిగా ప్రకటించారు. ఓట్ల లెక్కింపులో 15 మంది నిర్వహణ కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు. ఇందులో డాక్టర్ హేమలత నేతృత్వంలోని నల్గొండ సేవా సమితి ప్యానెల్‌కు 8 స్థానాలు, గోలి అమరేందర్ రెడ్డి ప్యానెల్‌కు 7 స్థానాలు దక్కాయి. దీంతో చివరి రౌండ్ వరకు ఉత్కంఠ నెలకొంది. సోమవారం కీలక పదవులకు నామినేషన్లకు 10 నిమిషాల గడువు ఇవ్వగా, పోటీ లేకపోవడంతో ఏకగ్రీవంగా ఎంపిక జరిగింది. చైర్‌పర్సన్‌గా – డాక్టర్ హేమలత, వైస్ చైర్‌పర్సన్‌గా – భీమనపల్లి శ్రీకాంత్, ట్రెజరర్‌గా – కుంభం జ్యోతి రెడ్డి, ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా – మంచుకొండ చిన్న బిక్షమయ్య ఎంపికయ్యారు. ఎన్నికలను అదనపు కలెక్టర్ ప్రేమ్ కుమార్, జిల్లా సహకార అధికారి మమత ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించారు. కొత్త కార్యవర్గంతో రక్తదాన శిబిరాలు, రక్తనిధి సేవలు, పేదలకు వైద్య సహాయం మరింత విస్తరిస్తుందని సేవాభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



# ఎల్‌నినో ప్రభావాన్ని సమష్టిగా ఎదుర్కోవాలి

మొదటి పేజీ తరువాయి

వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత, జౌళి, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఇతర ఉన్నతాధికారులు అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రైతు నేస్తం కార్యక్రమం ద్వారా రైతులతో మాట్లాడి యాసంగి 2026--27 పంటల సాగు ప్రణాళికపై దిశానిర్దేశం చేశారు. సూర్యాపేట మండల కేంద్రంలో కేసారం రైతు వేదిక నుంచి అదనపు కలెక్టర్ బి.హరిసింగ్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. జిల్లాలోని రైతు వేదికల నుంచి రైతులు కూడా పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ... రాష్ట్రంలో భూగర్భ జలాలు గణనీయంగా తగ్గిపోవడం, సాగునీటి లభ్యత పరిమితంగా ఉండటంతో రైతులు యాసంగి 2026--27 పంటల సాగుపై ఆచితూచి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. నీటి లభ్యత లేని ప్రాంతాల్లో సాగుకు దూరంగా ఉండాలని, అందుబాటులో ఉన్న నీటి వనరులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలను ఎంపిక చేసుకోవాలని కోరారు. ప్రస్తుత క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, ప్రజలు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

సూపర్ ఎల్‌నినో ప్రభావం తెలంగాణ రాష్ట్రానికే పరిమితం కాదని, ప్రపంచవ్యాప్తంగా వాతావరణ పరిస్థితులపై ప్రభావం చూపుతోందని తెలిపారు. అనేక ప్రాంతాల్లో తాగునీరు, సాగునీరు, విద్యుత్ లభ్యతకు సంబంధించిన సమస్యలు ఎదురయ్యే పరిస్థితులు ఉన్నాయని పేర్కొన్నారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న వనరులను పొదుపుగా వినియోగించుకోవడం, ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవడం అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు.రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు వాస్తవాలను అర్థం చేసుకుని, అందుబాటులో ఉన్న నీటి వనరులు, భూగర్భ జలాల పరిస్థితిని బట్టి పంటల సాగుపై నిర్ణయం తీసుకోవాలని సూచించారు. సాగునీరు అందుబాటులో ఉంటుందనే అంచనాతో అధిక నీటి అవసరం ఉన్న పంటలను సాగు చేసి నష్టపోకుండా జాగ్రత్త వహించాలని కోరారు.

### తాగునీటికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలకు తాగునీరు అందించడం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను ప్రణాళికాబద్ధంగా వినియోగిస్తూ, రానున్న జూన్ వరకు తాగునీటి అవసరాలను తీర్చేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తాగునీటి పథకాల్లో సమస్యలు తలెత్తితే వెంటనే మరమ్మతులు చేపట్టి, అవసరమైన చోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.సాగునీటి లభ్యత తక్కువగా ఉండటంతో పాటు భూగర్భ జలాలు కూడా గణనీయంగా తగ్గిన నేపథ్యంలో రైతులు సాగు విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని కోరారు. వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు అందించే సూచనలను పాటిస్తూ నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని తెలిపారు. రైతులకు అందుబాటులో ఉన్న నీటి వనరులు, వాతావరణ పరిస్థితులు, ప్రత్యామ్నాయ పంటలపై గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.

### మనుషులతో పాటు పశుసంపదను కాపాడుకోవాలి



కష్టకాలంలో మనుషుల అవసరాలతో పాటు పశు సంపదను కూడా రక్షించుకోవడం అత్యంత ముఖ్యమని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. పశువులకు తగినంత తాగునీరు, మేత అందుబాటులో ఉండేలా పశు సంవర్ధక, గ్రామీణాభివృద్ధి శాఖలు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో పశువులకు నీటి తొట్లు ఏర్పాటు చేయడంతో పాటు మేత కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు.ప్రస్తుత పరిస్థితులను ఎదుర్కోవడం ఒక్క శాఖతో సాధ్యం కాదని, ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, ప్రజలు సమష్టిగా పనిచేయాలని డిప్యూటీ సీఎం పిలుపునిచ్చారు. కష్టకాలంలో అధికారులకు సహకరించాలని, వారు అందించే సూచనలు, సలహాలను పాటించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. అందుబాటులో ఉన్న వనరులను పొదుపుగా వినియోగించుకుంటూ సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు.

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ

సూపర్ ఎల్‌నినో ప్రభావంపై రాష్ట్ర ప్రభుత్వం గత ఫిబ్రవరి నుంచే రైతులకు అవగాహన కల్పిస్తోందని తెలిపారు. ముందస్తు అవగాహన, ప్రత్యామ్నాయ పంటల సాగుపై ప్రభుత్వం చేసిన ప్రయత్నాల ఫలితంగా సుమారు 10 లక్షల ఎకరాల్లో వరి సాగు తగ్గిందని, మహబూబ్‌నగర్ ప్రాంతంలో కూరగాయల సాగు పెరిగిందని వివరించారు.యాసంగిలో అధిక నీటి అవసరం ఉన్న వరి సాగుపై రైతులు జాగ్రత్తగా నిర్ణయం తీసుకోవాలని సూచించారు. వరి పంటకు అధిక ధర లభిస్తోందనే ఆశతో సాగు చేస్తే, నీటి కొరత కారణంగా రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పప్పుధాన్యాలు, నూనెగింజలు, పొద్దుతిరుగుడు, కూరగాయలు, ఇతర ఉద్యాన పంటలు, ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు.డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సేద్య పద్ధతుల వినియోగాన్ని పెంచేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. రైతులు తప్పుదోవ పట్టించే ప్రచారాన్ని నమ్మకుండా వ్యవసాయ శాఖ అధికారులు ఇచ్చే సూచనలు, అందుబాటులో ఉన్న నీటి వివరాల ఆధారంగా పంటలను ఎంపిక చేసుకోవాలని కోరారు. రైతులకు విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని, రాష్ట్రంలో యూరియా, విత్తనాల లభ్యతకు ఇబ్బందులు రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అలాగే నీటి వనరులు, విద్యుత్ సరఫరాపై స్పష్టమైన సమాచారం ఇవ్వాలి అని పంటలకు నీటి సరఫరా, విద్యుత్ లభ్యతపై అధికారులు రైతులకు వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా సమాచారం అందించాలని మంత్రి తుమ్మల సూచించారు. ఏ ప్రాంతంలో ఎంత నీరు అందుబాటులో ఉంది, ఎంత విద్యుత్ సరఫరా చేయగలమనే వివరాలను స్పష్టంగా తెలియజేయాలని చెప్పారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా పాత తాగునీటి పథకాలను మరమ్మతులు చేసి పునరుద్ధరించాలని, మిషన్ భగీరథ సరఫరాలో అంతరాయాలు ఏర్పడినా ప్రజలకు ఇబ్బందులు రాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. విద్యుత్ ఉత్పత్తిని పెంచేందుకు థర్మల్ విద్యుత్ కేంద్రాలు గరిష్ట సామర్థ్యంతో పనిచేసేలా చూడాలని, సౌర విద్యుత్ ఉత్పత్తిని పెంచాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ... సూపర్ ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు పెరిగి, వర్షపాతం తగ్గి, కరువు పరిస్థితులు మరింత తీవ్రం అయ్యే అవకాశం ఉందని తెలిపారు. డిసెంబర్ నుంచి ఫిబ్రవరి వరకు ఈ ప్రభావం మరింత బలపడవచ్చని పేర్కొన్నారు. రాష్ట్రంలో సాధారణం కంటే 20 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని, ఖరీఫ్ సాగు విస్తీర్ణం 15 శాతం తగ్గిందని వివరించారు. పత్తి, వరి పంటలు తీవ్రంగా ప్రభావితమయ్యాయని, భూగర్భ జలాల పరిస్థితి కూడా ఆందోళనకరంగా ఉందని తెలిపారు. 30 టీఎంసీల సామర్థ్యం ఉన్న సింగూరు జలాశయంలో సుమారు 4 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉందని పేర్కొన్నారు.రాష్ట్రంలో రికార్డు స్థాయిలో 20 వేల మెగావాట్ల విద్యుత్ సరఫరా చేసినప్పటికీ, దేశవ్యాప్తంగా విద్యుత్ కొరత నెలకొన్న పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. రైతు భరోసా కింద 75 లక్షల మంది రైతులకు రూ.8,500 కోట్ల నిధులు విడుదల చేశామని, లక్ష ఎకరాలకు స్ప్రింక్లర్లు పంపిణీ చేశామని, ఖరీఫ్‌లో సబ్సిడీ విత్తనాలు అందించామని వివరించారు.ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటిని తాగునీరు, పశువుల అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ వినియోగించాలని, 2027 జూన్ వరకు తాగునీటి అవసరాలను తీర్చేలా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్లను ఆదేశించారు. కృష్ణా బేసిన్‌లో సుమారు 270 టీఎంసీలకు గాను 80 టీఎంసీలు, గోదావరి బేసిన్‌లో సుమారు 100 టీఎంసీల నీరు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జలాశయాల్లోని లైవ్ స్టోరేజీ నీటిని ఈ ఏడాది సాగునీటి కోసం వినియోగించే పరిస్థితి లేదని స్పష్టం చేశారు.

### ఉపాధి హామీ పనులను విస్తృతం చేయాలి

కరువు పరిస్థితుల నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి సమస్యలు తలెత్తకుండా ఉపాధి హామీ పథకం కింద పనులను విస్తృతంగా చేపట్టాలని సీఎస్ సూచించారు. గత ఏడాది రోజుకు సగటున 25 వేల మంది కూలీలు పనులకు హాజరుకాగా, ప్రస్తుతం ఆ సంఖ్య 2.5 లక్షలకు చేరిందని తెలిపారు. నెలాఖరుకు రోజువారీ కూలీల హాజరును 5 లక్షలకు పెంచేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో రోజుకు కనీసం 60 మంది కూలీలకు పని కల్పించేలా నీటి సంరక్షణ పనులు, చెరువులు, కుంటల్లో పూడికతీత, నీటి నిల్వ నిర్మాణాలు, ఫామ్ పాండ్స్, వ్యక్తిగత, సామూహిక సోక్ పిట్ల నిర్మాణం వంటి పనులను చేపట్టాలని సూచించారు. పశువులకు మేత అందుబాటును పెంచే పనులను కూడా ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టాలని తెలిపారు.ప్రతి 40 మంది కూలీలకు ఒక మేట్‌ను నియమించి పనులను పర్యవేక్షించాలని పేర్కొన్నారు.

### సింగూరు పరిధిలో తాగునీటి సరఫరాకు ప్రత్యామ్నాయ ప్రణాళిక

పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్ మాట్లాడుతూ.. సింగూరు పరిధిలోని 19 పట్టణాలు, సుమారు 2 వేల ఆవాసాలకు తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీరు డిసెంబర్ 10 వరకు అవసరాలు తీర్చేందుకు సరిపోతుందని, ఆ తర్వాత కూడా సరఫరాలో ఇబ్బందులు రాకుండా రూ.110 కోట్లతో ప్రత్యామ్నాయ ప్రణాళిక రూపొందించామని, ఈ వారంలో నిధులు మంజూరయ్యే అవకాశం ఉందని వివరించారు.

ఉపాధి హామీ పథకం ద్వారా ఓవర్‌హెడ్ సర్వీస్ రిజర్వాయర్ల మరమ్మతులు చేపట్టడంతో పాటు, అక్టోబర్‌లో జిల్లాల వారీగా ప్రత్యేక సమావేశాలు నిర్వహించి కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు కార్యాచరణ అమలు చేస్తామని తెలిపారు.ఇంధన శాఖ ప్రత్యేక కార్యదర్శి నవీన్ మిట్టల్ మాట్లాడుతూ... సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి వరకు దేశవ్యాప్తంగా విద్యుత్ లభ్యత గణనీయంగా తగ్గుతోందని తెలిపారు. నాగార్జునసాగర్, శ్రీశైలం జలవిద్యుత్ కేంద్రాల్లో గతంలో 3,750 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి కాగా, ఈ ఏడాది సుమారు 930 మిలియన్ యూనిట్లు మాత్రమే ఉత్పత్తి అయిందని వివరించారు. పగటిపూట విద్యుత్ అవసరాలను తీర్చగలుగుతున్నప్పటికీ, రాత్రి పీక్ అవర్స్‌లో కొంత కొరత ఉంటోందని తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తిని పెంచడంతో పాటు మార్కెట్ నుంచి విద్యుత్ కొనుగోలుకు ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. 3,000 మెగావాట్ల బ్యాటరీ నిల్వతో కూడిన సౌర విద్యుత్ ప్రాజెక్టు, 2,000 మెగావాట్ల రౌండ్-ది-క్లాక్ పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టు, 800 మెగావాట్ల బ్యాటరీ నిల్వ ప్రాజెక్టు సహా నాలుగు ప్రధాన ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

భారత వాతావరణ శాఖ నిపుణురాలు డాక్టర్ ఎ. శ్రావణి మాట్లాడుతూ,లి ప్రస్తుతానికి తెలంగాణలో చెప్పుకోదగిన వర్షాలు కురిసే అవకాశం లేదని తెలిపారు. నవంబర్, డిసెంబర్ నెలల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని, ఈశాన్య రుతుపవనాల ప్రభావం రాష్ట్రంపై చాలా తక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. అక్టోబర్ నుంచి నవంబర్ వరకు సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు, అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

### రైతులుపంటల సాగుపై నిర్ణయం తీసుకోవాలి

అదనపు కలెక్టర్ బి.హరి సింగ్ మాట్లాడుతూ... రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర రవాణా శాఖ బీసీ సంక్షేమ శాఖ మాత్యులు పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, వ్యవసాయ నిపుణులు, ఉన్నతాధికారులు రైతులతో మాట్లాడి యాసంగి పంటల సాగుపై పలు సూచనలు అందించారని తెలిపారు. సూపర్ ఎల్‌నినో ప్రభావంతో నీటి లభ్యత తగ్గే అవకాశం ఉందని, భూగర్భ జలాలు ఇప్పటికే తగ్గిపోవడంతో పాటు రానున్న రోజుల్లో విద్యుత్ సరఫరాపైనా ఒత్తిడి ఉండవచ్చని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో యాసంగిలో అధిక నీటి అవసరం ఉన్న వరి వంటి పంటలను సాగు చేయకుండా రైతులు జాగ్రత్త వహించాలని సూచించారు. తక్కువ నీటితో 45 నుంచి 60 రోజుల్లో పంట చేతికొచ్చే పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని, తగినంత నీటి లభ్యత లేని ప్రాంతాల్లో పంటలు సాగు చేయకుండా ఉండాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.ప్రతి మంగళవారం నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమం ద్వారా రైతులకు పంటల ఎంపిక, నీటి లభ్యత, ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. రానున్న యాసంగి సీజన్‌లో రైతులు పంటలు సాగు చేసి నష్టపోకుండా చూడటమే ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని తెలిపారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీఓ వేణు మాధవరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్ రెడ్డి, డిపిఓ యాదగిరి, హార్టికల్చర్ అధికారి నాగయ్య, డిప్యూటీ తహసీల్దార్ లాల్, ఏఓ కృష్ణ సందీప్, ఎంపీడీవో బాలకృష్ణ, సర్పంచ్ రేకారమణ సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.